
ప్రజాశక్తి

మంగళవారం 17 సెప్టెంబర్ 2024 8 పేజీలు




ఎన్‌టిఆర్ కృష్ణా

విజృంభిస్తున్న జ్వరాలు



ప్రజాశక్తి-గన్నవరం

సీజనల్ వ్యాధులు విజృంభించడంతో గన్నవరం మండలంలో ప్రజలు అల్లాడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల తాకిడి భారీగా పెరిగింది. రక్త పరీక్ష కౌంటర్లు సంఖ్య పెంచకపోవడం రోగులను ఇబ్బందులకు గురిచేస్తోంది. వ్యాధి తీవ్రతతో నీరసంగా ఉన్న రోగులే రక్త నమూనా లను ఇవ్వడానికి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. విచిత్రం ఏమంటే జ్వరాలతో వచ్చిన వారందరికీ టైఫాయిడ్ రక్త పరీక్షలు చేయడానికి సరిపడా కిట్లు లేవు. ఎమర్జెన్సీ అనుకున్న వారికి మాత్రమే పరీక్షలు చేస్తున్నారు. మిగిలిన వారికి చికిత్సలు చేసి పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోగులందరికి మెరుగైన సేవలు అందించడానికి వీలుగా ఈ సామాజిక ఆసుపత్రిని విస్తరించాలనే చర్చ జరుగుతోంది. గన్నవరం గ్రామానికి చెందిన గోపి టైఫాయిడ్ వ్యాధితో బాధపడుతున్నాడు.

రోగులతో ప్రభుత్వాసుపత్రి కిటకిట

కేసరపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మీ జ్వరతీవ్రతతో బాధ పడుతున్నారు. వీరిద్దరికీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేసినా జ్వరం తగ్గకపోవడంతో విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లిపోయారు. మరోపక్క సీజనల్ డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ తదితర వ్యాధులు పెరగటంతో ఆసుపత్రికి జ్వరంతో బాధపడుతూ వచ్చే పేషెంట్లకు రక్త నమూనా పరీక్ష చేయించడం, ప్లేట్లెట్లు కౌంట్ చేయడం తప్పనిసరిగా మారింది. బెడ్ల దగ్గరకు వెళ్లి రక్త సమూనాలు సేకరించే పరిస్థితిలో లేదు. దీంతో రక్త పరీక్ష కేంద్రం వద్ద రక్త నమూనాలను ఇవ్వడానికి గంటల తరబడి పేషెంట్లు నిరీక్షించాల్సి వస్తోంది. మరోపక్క వ్యాధిగ్రస్తులకు సహాయకులుగా వచ్చే వారికి వెయిటింగ్ హాల్ లేదు. ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ అసుపత్రి లోపల, వెలుపల, చెట్లకింద కూర్చొని రోగులు ఫోన్ చేసిన వెంటనే వారికి సహాయం చేయడానికి బెడ్ దగ్గరకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ఆసుపత్రిలో ఒపి 300 ఉండగా 200 మంది జ్వరాలతోనే వస్తున్నారు.

ఆసుపత్రి విస్తరణతోనే సమస్య పరిష్కారం

గన్నవరం ఆసుపత్రిని మూడేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పారు. 40 పడకల నుంచి 60 పడకల వరకు విస్తరణ చేస్తామని అధికారులు తెలిపారు. కానీ చర్యలు తీసుకోవడం మర్చిపోయారు. ఫలితంగా ఆరోగ్య కేంద్రం విస్తరణ ఆగిపోయింది. వైద్యరంగంలోని ఎంబీబీఎస్ (మిగతా 2లో)

స్నేహ, మర్యాదపూర్వక సేవలే లక్ష్యం

- రెవెన్యూ స్పెషల్ సిఎస్ సిసోడియా
- గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖల ద్వారా ప్రజలకు మరింత స్నేహ, మర్యాదపూర్వక వాతావరణం కల్పించడమే తమ ధ్యేయం అని రెవెన్యూ స్పెషల్ సిఎస్ ఆర్‌పి సిసోడియా అన్నారు. స్థానిక చుట్టుగుంట సెంటర్ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా గల గుణదల సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ప్రత్యేక పోడియంను రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజి ఎంవి. శేషగిరి బాబు, స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌తో కలిసి సిసోడియా తొలగించారు. అనంతరం సిసోడియా మాట్లాడుతూ (మిగతా 2లో)



పోడియంను తొలగిస్తున్న సిసోడియా, గద్దె రామ్మోహన్

వరద బాధితులకు నెల్లూరు జిల్లా వాసుల సాయం



వార్త 2లో

సాయం అందజేస్తున్న సాయిపేట పంచాయతీ అభివృద్ధి వేదిక సభ్యులు

వరద ప్రాంతాల్లో పన్ను వసూళ్లు సరికాదు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: 2024- 25 సంవత్సరానికి సంబంధించి వరద బాధిత ప్రాంతాల్లో ఆస్తి పన్ను, మంచినీరు, డ్రైనేజీ, ఖాళీ స్థలాల పన్ను పూర్తిగా రద్దు చేయాలని లేకపోతే బాధిత ప్రజలను కలుపుకొని ఉద్యమించాల్సి వస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు హెచ్చరించారు. సింగ్‌నగర్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని విఎంసి అందజేసిన పన్ను నోటీసుల విషయాన్ని బాధిత ప్రజలు బాబూరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై బాబూరావు మాట్లాడుతూ బాధితులకు సేవలు అందించడంపై దృష్టి పెట్టాల్సిన నగరపాలక సంస్థ పన్నుల వసూళ్లపై అత్యుత్సాహం చూపించడం సరికాదన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి విజయవాడలో పర్యటిస్తూ బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఒకపక్క ప్రకటనలు చేస్తూనే... మరోవైపు పన్నుల వసూళ్లపై విఎంసి ఆదేశాలివ్వడం భావ్యం కాదన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో విఎంసి పాలకపక్షం, ప్రజాప్రతినిధులు మొహం చాటేసారని, బాధ్యతను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రజలు వరద కష్టాల్లో ఉంటే ఈ నెల 30వ తేదీలోగా విఎంసి చెల్లించాల్సిన పన్నులు చెల్లించాలని, లేకపోతే పెనాల్టీలు పడతాయని అధికారులు ప్రకటన విడుదల చేయటం గర్హనీయమన్నారు. విజయవాడ నగరంలో 32 డివిజన్లలో 2.70 లక్షల కుటుంబాలకు పైగా, దాదాపు 8 లక్షల జనాభా వరదల వల్ల ఇబ్బందులు పడ్డారన్నారు. అధికారులు వారిని అన్ని విధాలా అదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పన్నుల రద్దు వల్ల కోల్పోయే ఆదాయాన్ని ప్రభుత్వం నగరపాలక సంస్థకు చెల్లించాలన్నారు. ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి చేయడం ఆపాలని కోరారు.

ముంపు పొలాల నష్టగణన సక్రమంగా చేసి

సాయం రూ.25 వేలకు పెంచాలి




ఉంగుటూరు, గన్నవరం మండలాల్లో పంటలను పరిశీలిస్తున్న రైతు, కౌలురైతు సంఘాల నాయకులు

- రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర నేతలు డిమాండ్
- బుడమేరు, ఏలూరు కాల్వ ముంపు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - గన్నవరం, ఉంగుటూరు, గుడివాడ

బుడమేరు, ఏలూరు కాల్వ ముంపు నష్టాలపై నష్ట గణన (ఎన్యూమరేషన్) సక్రమంగా జరగలేదని, ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల సాయం ఏమూలకూ చాలదని ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘాల రాష్ట్ర, జిల్లా నేతల బృందం పేర్కొంది. ఈనేపథ్యంలో నష్ట పరిహారాన్ని రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేసింది. రైతు, కౌలు రైతు సంఘాల నేతల బృందం సోమవారం కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద ఏలూరు కాల్వకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించింది. గండితో నీట మునిగిన, మునుగుతున్న పొలాలను పరిశీలించింది. అలాగే గన్నవరం నియోజకవర్గం బుడమేరు పరిధిలోని వెల్దిపాడు, ఎలకపాడు, ఉంగుటూరు, కొయ్యగూరపాడు, ఒంద్రపాడు, ఆముదాలపల్లి, చేగుర్తిపాడు, కంద్రిక, పుట్టగుంట, మోపర్రు, జొన్నపాడు, తుమ్మలపల్లి, పెదలింగాల, ఓగిరాల, ఆరుగొలను, అరిపిరాల, కొరిపిరాల గ్రామాలతోపాటు గుడివాడ నియోజకవర్గంలోని నందివాడ మండలంలోని బుడమేరు ముంపు పొలాలను, ఆక్వా చెరువులను పరిశీలించింది. బాధిత రైతులతో బృందం నేతలు మాట్లాడారు. అనంతరం బృందం నేతలు గన్నవరం, గుడివాడల్లో మీడియాతో మాట్లాడారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ.. బుడమేరు ముంపుపై 1960 నుంచి ఆయా ప్రభుత్వాలు (మిగతా 2లో)



పెడనలో ఘర్షణ వాతావరణం

వార్త మెయిన్‌లో

పెడనలో ఉద్రిక్తత

- ఘర్షణలో నలుగురికి గాయాలు, ఫర్నీచర్ ధ్వంసం
- భారీగా పోలీస్ బందోబస్తు

మొదటిపేజీ తరువాయి

విజృంభిస్తున్న జ్వరాలు

వైద్య సేవలు అందిస్తున్నారు. మంచి వైద్యం అందుతోందనే ప్రచారం జరగడంతో రోజువారీ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. గన్నవరం తో పాటు బుద్ధవరం, కేసరపల్లి, అల్లాపురం, దావాజీ గూడెం, వెన్నుతల, తెంపల్లి, చిన్న అవుటపల్లి తదితర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వస్తున్నారు. గతంలో రోజూ ఒపి 200 ఉండగా ప్రస్తుతం 300కి పెరిగింది. సీజనల్ వ్యాధుల కారణంగా ఆ సంఖ్య మరింత పెరిగింది. నీరసించిన వారిలో ఎక్కువ మందిని ఇన్పేషంట్లుగా చేర్చుకొని సేవలు అందించాల్సి వస్తోంది. మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేని పరిస్థితి ఉంది. కొన్ని మందులను బయటకు రాస్తున్నారు వైద్యులు. అది తప్పని పరిస్థితుల్లో. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో 40 బెడ్లు ఉన్నా చాలడం లేదు. ఆసుపత్రిని విస్తరించి కనీసం 100 పడకలు ఏర్పాటు చేయడంతో పాటు రోగులు ఇబ్బంది పడకుండా రక్త ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహణకు, వైద్య సేవలకు అవసరమైన సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

ఆసుపత్రికి రోగులు పెరిగారు : డాక్టర్ సునైనా

పది రోజులుగా వర్షాలు పడి ఆగిన తర్వాత రోగుల తాకిడి పెరిగింది. ఆసుపత్రి ఇన్చార్జ్ వైద్యులు సారమ్మ సలహాలు, సంప్రదింపులతో ఆసుపత్రికి వచ్చేవారికి ఎటువంటి సమస్యలు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. చిన్నపిల్లలకు సారమ్మ వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక్కొసారి బెడ్ల సమస్య ఎదురైన అందరికి సర్దుబాటు చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల తాకిడి పెరగడం వల్ల రోగుల ఇబ్బందులు పెరిగాయి. గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు కొన్ని సేవలు అందిస్తున్న జ్వరాలు ఎక్కువగా ఉండటంతో గన్నవరంలోని ఆసుపత్రికి వస్తున్నారు. వారికి తగిన విధంగా ట్రీట్మెంట్ చేసి పంపిస్తున్నారు. ఆసుపత్రిని అప్ గ్రేడ్ చేస్తే చాలావరకు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

స్నేహ, మర్యాదపూర్వక సేవలే లక్ష్యం

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రభుత్వ అధికారులు కూడా ప్రజాసేవకులే అనే భావన ప్రజల్లో కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో రిజిస్ట్రార్ పోడియం చూస్తే ప్రజలకు కోర్టులో ఉన్నామనే భావన కలగకుండా ఉండేందుకే ఇటువంటి మార్పులు తీసుకువస్తున్నామన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ కాలం నుండి కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాచరిక పోకడలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని కల్పిస్తున్న క్రయవిక్రయదారులను ఎంతో మర్యాదపూర్వకంగా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సేవలు పొందే క్రయవిక్రయదారులు ద్వారా ఈ ఉద్దేశంతోనే గత రాచరిక పోకడలకు స్వస్తి పలికేందుకు రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆసనాలు, పోడియంలను తొలగించి ఇతర ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులకు ఇటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని అదే తరహా సౌకర్యాలను రిజిస్ట్రార్ కార్యాలయాలలో కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. ఇకపై రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో సేవలు పొందేందుకు వచ్చే క్రయవిక్రయదారులు మంచి వాతావరణంలో సేవలను పొందగలుగుతారన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో అత్యంత పారదర్శకతను పాటించేలా అన్ని చర్యలను తీసుకుంటున్నామన్నారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో రాచరిక పోకడలకు స్వస్తి పలికి సాధారణ, స్నేహపూర్వక వాతావరణం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్దేశమన్నారు. ఇటువంటి సంస్కరణలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలుస్తాయన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని అధికారులు ప్రజాసేవకులే అన్న భావన కల్పించగలుగుతామన్నారు. నిస్వార్థమైన సేవలందించి ప్రజల నుండి మన్ననలను పొందేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుణదల జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు కె.ప్రసాదరావు, ఎం.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



వరద బాధితులకు నెల్లూరు జిల్లా వాసుల సాయం



ప్రజాశక్తి-విజయవాడ : నెల్లూరు జిల్లా కొండాపురం మండలం సాయిపేట పంచాయతీ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో సోమవారం 250 మంది వరద బాధితులకు నిత్యావసరాలు, బట్టలు, బియ్యం, సరుకులు, దుస్తులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు చేతుల మీదుగా సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో పంపిణీ చేశారు. ప్రజాశక్తి జర్నలిజం కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఉన్నం వెంకటేశ్వర్లు, నెల్లూరు జిల్లా సిపిఎం కార్యదర్శి మోహన్ సూచన మేరకు సాయిపేట పంచాయతీ అభివృద్ధి వేదిక, సామాజిక కార్యకర్త భీమిరెడ్డి అరుణ, తాటికొండ ప్రవీణ్, వల్లూరి వెంకటేశ్వర్లు, షేక్ మహబూబ్‌బాషా, కొండపాలి కొండయ్య, మరో పది మంది యువకులు (టిడిపి, వైసిపి) సాయిపేట పంచాయతీ పరిధి (ఐదు హెమ్లేట్స్)లోని ఇంటింటికీ వారం రోజుల పాటు తిరిగి ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి డబ్బులు, బియ్యం, బట్టలు విరాళాలుగా వసూలు చేశారు. ఏడు కిలోల బియ్యం, ఒక కిలో నూనె, ఒక కిలో కందిపప్పు, అర కిలో చింతపండు, ఒక కిలో గోధుమపిండి ఇలా 11 రకాల సరుకులను కలిపి ఒక ప్యాక్‌గా, బట్టలు మూడు రకాలుగా విభజించి బాధితులకు అందజేశారు. వీటి మొత్తం విలువ సుమారు మూడు లక్షల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త భీమిరెడ్డి అరుణ మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో యువకులు, పెద్దలు ఇంటింటికీ తిరిగి సరుకులు, బియ్యం, డబ్బులు వసూలు చేసిన వాటిని తీసుకొచ్చి స్థానికంగా ఉన్న సిపిఎం నాయకుల ద్వారా వరద బాధితులకు అందజేయడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. ఇదే రీతిలో గతంలో అనంతపురంలో కూడా వరదలు వచ్చిన సందర్భంలో తమ పంచాయతీ తరుపున దుప్పట్లు, వివిధ రకాల సరుకులు, టవల్స్, దోమ తెరలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

2500 కుటుంబాలకు దుస్తులు పంపిణీ



ప్రజాశక్తి-విజయవాడ: వరద బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సబ్ రిజిస్ట్రార్స్ అసోసియేషన్ ముందడుగు వేయటం స్ఫూర్తి దాయకమని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవిన్యూ, విపత్తుల నిర్వహణ, భూ పరిపాలన, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్) ఆర్‌పి సిసోడియా అన్నారు. సోమవారం విజయవాడ సింగ్ నగర్ లో అసోసియేషన్ సమకూర్చిన వస్త్రాలను, సిసోడియా వరద బాధితులకు పంపిణీ చేశారు. ఒక్కొక్కటి రూ.1100 విలువైన వస్త్రాల సంచిని 2500 కుటుంబాలకు పంపిణీ చేయగా, దానిలో ఒక చీర, లంగా, నైటీ ,లుంగీ, టవల్ అందించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ వరద రూపంలో ప్రకృతి ప్రకోపానికి గురైన సాటి మనుషులను ఆదుకొనడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఉద్యోగులు ఇప్పటికే 25 లక్షల రూపాయల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారని, తాజాగా ఈ వితరణ కార్యక్రమాన్ని చేపట్టి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మధ్య నియోజకవర్గ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ సబ్ రిజిస్ట్రార్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ గోపాల్, జనరల్ సెక్రటరీ ఎం కృష్ణ ప్రసాద్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు శాఖ విజయవాడ డిఐజి ఎ.రవీంద్రనాద్, నెల్లూరు డిఐజి వి.కిరణ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ వి. ఎస్. ఆర్. ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ (మార్కెట్ వాల్యూ అండ్ ఆడిట్) కె. రామారావు, రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. వరదల సమయంలో నిరంతరం సేవలు అందిస్తూ, బాధితులకు అండగా నిలిచిన సిసోడియాను శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు ప్రత్యేకంగా సత్కరించారు.



పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: వరద ప్రభావిత ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలను సత్వరమే తొలగించాలని లేకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని నగర కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. సోమవారంకండ్రిక, ఉడా కాలనీ, రాజీవ్ నగర్, నున్న, ముస్తాబాద్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాలలోని స్కూళ్లు, ఆస్పత్రులు ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు.

స్వచ్ఛత హి సేవలో పాల్గొనండి

స్వచ్ఛత హి సేవలో ప్రజలందరూ పాల్గొనాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పిలుపునిచ్చారు. మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో మంగళవారం నిర్వహించనున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కే.వి.సత్యవతి, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ శిరిన్ రాయ్ పాల్గొన్నారు.

సాయం రూ.25 వేలకు పెంచాలి

మిత్రా కమిటీ, బుర్రా కమిటీ, శివరామకృష్ణ కమిటీలు వేశాయని, కానీ ఆ కమిటీల నివేదికల్లో పొందుపరచిన అంశాలను ఆయా ప్రభుత్వాలు వదిలేశాయని విమర్శించారు. 20 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని మాత్రమే తట్టుకునే బుడమేరులో అనేక వాగులు, కాల్వలు కలిసి 48 వేల క్యూసెక్కుల నీటితో వరద వెల్లువెత్తిందని, ఫలితంగా విజయవాడ ముంపునకు గురైందని వివరించారు. ఇలాంటి పరిస్థితులను గుర్తించిన కమిషన్లు ఆనాడే వంపులు (వంకర) తొలగించి కేసరపల్లి వరకూ తిన్నగా డ్రెయిన్ నిర్మించాలని సూచించాయన్నారు. దానిని పాటించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. ప్రస్తుతం బుడమేరుకూగానీ, దానితో అనుసంధానమైన కాల్వలు, వాగులకుగానీ దాదాపు 30 చోట్ల, దీని పరిధిలోనే మరో 30 చెరువులకు గండ్లు పడ్డాయని తెలిపారు. ఈ కారణంగా 5.67 లక్షల ఎకరాలు ముంపు బారిన పడ్డాయన్నారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ.. ప్రతి రైతూ ఎకరా పొలంపై రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టాడని, కౌలు రైతు కౌలు సహా ఇంకా అదనంగా పెట్టుబడి పెట్టాడని తెలిపారు. నష్ట గణనలో వాస్తవ సాగుదార్లను వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ.10 వేలు సాయం ఏ మూలకూ సరిపోదన్నారు. ఈసాయం కూడా 33 శాతం నష్టం జరిగితేనే పరిగణలోకి తీసుకుంటున్నారని, అంతేగాక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటామని చెపుతున్నారని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా బాధిత రైతులకు ఎటువంటి ప్రయోజనమూ కలగదన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ గతం నుంచి పాలకవర్గాలు బుడమేరును నిర్లక్ష్యం చేశాయని, నిధులను దుర్వినియోగం చేశాయని విమర్శించారు. పొలాలు ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి.లక్ష్మణ స్వామి మాట్లాడుతూ తరిగొప్పుల, లంకపల్లి, పుట్టగుంట గ్రామాల వద్ద బుడమేరు వంతెన నిర్మించాలని దశాబ్దాలుగా ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దశాబ్ద కాలంగా ఉంగుటూరు – లంకపల్లి మధ్య బుడమేరుపై వంతెన నిర్మిస్తామని చెప్పి పిల్లర్లు వరకే వేసి గాలికి వదిలేశాయని పేర్కొన్నారు. కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ ప్రైవేటు బీమా కంపెనీలకు ప్రభుత్వాలు చెల్లింపులు జరుపుతున్నాయే తప్ప ప్రభుత్వ బీమా సంస్థలకు చెల్లించటం లేదన్నారు. బుడమేరును ప్రక్షాళన చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో రైతు సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు గొరిశెట్టి నాగేశ్వరరావు, వివిధ రైతు, ప్రజా సంఘాల నాయకులు జిల్లా, మండల నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, నీలం మురళీకృష్ణారెడ్డి, అజ్మీరా వెంకటేశ్వరరావు, బేతా శ్రీనివాసరావు, సాంబశివరావు, సూరగాని సాంబశివరావు, కైలే ఏసుదాసు, పల్నాటి ప్రసాద్, అవుటుపల్లి సాంబయ్య, రైతులు రామకృష్ణ, శ్రీనివాసరావు, సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



బంటుమిల్లిలో మాట్లాడుతున్న వై నరసింహారావు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లిలోని గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ సోమవారం జరిగింది. లంకదాసుల అజయ్ ఘోష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుండి క్షుణ్ణంగా పరిశీలించి మాట్లాడే స్వభావం ఉందని, ఆ స్వభావమే ఆల్ ఇండియా నాయకుడిగా ఎదిగేందుకు దోహదపడిందని అన్నారు. ముక్కు చూటిగా మాట్లాడే ఏచూరి ఎమర్జెన్సీ టైం నుంచి సిపిఎంలో అతి చిన్న వయసులోనే సెంట్రల్ కమిటీ నెంబరు అయ్యారని, 11 సంవత్సరాల పాటు ఎంపీగా చురుకైన పాత్ర నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు పరుచూరి ధనశ్రీ, సిపిఎం మండల కార్యదర్శి మాజేటి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు కొల్లాటి శ్రీనివాసరావు, సిపిఎం మచిలీపట్నం నాయకులు పౌల్ నాయుడు, పొదిలి వెంకన్న, బొడ్డు నాగరాజు, వంగల రాజు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఏచూరి కి ఘన నివాళి అర్పించారు. అంగలూరు గ్రామంలో కౌలు రైతు సంఘం మండల గౌరవాధ్యక్షులు మామిడి బాబూరావు ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళ్ళు అర్పించారు. చంద్రాల గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు మదిరి నాగరాజు నివాళ్ళు అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం మండల బాధ్యులు బివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏచూరి ఉపాధి హామీ చట్టం రావటానికి పార్లమెంట్‌లో పోరాడారని. రాజ్యాంగాన్ని ,ప్రజాస్వామ్యాన్ని లౌకిక తత్వాన్ని రక్షించటానికి కృషి చేశారని కొనియాడారు. అంగలూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శి చిలుముల కష్ణ ,చాట్ల అర్జున రావ్, చిలుముల రాంబాబు,జువ్వనపూడి ప్రభాకర్, తంగిరాల రమేష్, కొండూరు ప్రవీణ్, చప్పిడి బ్రహ్మము, బొకినాల కరునాకర్, చంద్రల గ్రామంలో మదిరి శేఖర్, ఎస్. వెంకటేశ్వరరావు, టి.నరేష్, ఎమ్.దానియేలు, ఎమ్.ఫిలిప్, ఎమ్.సురేష్,డి.స్కైలాబ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ:** ఏచూరికి సిపిఎమ్ టిడ్కో కాలనీ, అభివృద్ధి కమిటీ తరుపున సి121 ,సి116 బ్లాక్ సెంటర్‌లో నివాళులర్పించారు. సిపిఎమ్ సానుభూతి పరులు ఆర్ శివారాంప్రసాద్, ఎమ్ చిన్నమ్ములు సోమవారం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు బసవ అరుణ, అంబటి లక్ష్మీ, షైక్ నజీనా లక్ష్మీ, గౌరీ, గరికపాటి నాగమణి, వంశీకష్ణ, పార్వతి పాల్గొన్నారు.



8 అడుగుల కొండచిలువ హల్‌చల్

ప్రజాశక్తి - గంపలగూడెం : అత్యంత ప్రమాదకరమైన 8 అడుగుల పొడవున్న కొండ చిలువను యువకులు హతమార్చారు. గంపలగూడెం టౌన్ పరిధిలో ఉన్న ఎన్టీఆర్ కాలనీ (మార్కెట్ యార్డు) చేకు వెంకటేశ్వరరావు ఇంటి వద్ద సోమవారం రాత్రి 9 గంటల సమయంలో సంచరిస్తూ, కనిపించింది. చుట్టుపక్కల ఉన్న యువకులకు తెలపక కర్రలతో వచ్చి కొట్టి చంపారు. ఇదే కొండచిలువ గత ఆరు నెలల నాడు ఆ ప్రాంతంలోనే కనిపించిన నేపథ్యంలో చంపేందుకు వెంటాడుతుండగా, పొదల్లోకి తప్పించుకుపోయినట్లు యువకులు తెలిపారు. దీనితో అక్కడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

'విద్యా కుటుంబం' సేవలు స్ఫూర్తిదాయం

ప్రజాశక్తి-మోపిదేవి : నియోజకవర్గ ఖ్యాతి పెరిగే స్థాయిలో మహోన్నత కార్యక్రమం నిర్వహించిన నియోజకవర్గ విద్యా కుటుంబం సేవలు స్ఫూర్తిదాయకమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపు మేరకు నియోజకవర్గ విద్యా కుటుంబం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 2,600 వరద బాధిత కుటుంబాలకు రూ.29,78, 185లతో వంట పాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని మోపిదేవి మండలం బొబ్బర్లంకలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ దేవానందరెడ్డి ప్రారంభించారు. బొబ్బర్లంకలో 350 కుటుంబాలకు వంట పాత్రల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితులకు అండగా నిలిచిన నియోజకవర్గ ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, విద్యార్థుల మహోన్నత సేవ రాష్ట్రానికే ఆదర్శమన్నారు. సమాజానికి కష్టం వచ్చిన ప్రతిసారి విద్యా కుటుంబం మేమున్నామంటూ అండగా నిలుస్తోందన్నారు. డైరెక్టర్



ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ దేవానందరెడ్డి, డెమోక్రటిక్ పి.ఆర్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసరావు, నియోజవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



అవనిగడ్డలో బాధితులకు సరుకులు అందజేస్తున్న దృశ్యం



చల్లపల్లిలో బాధితులకు సరుకులు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని వసుమట్ల వరద బాధితులకు పులిగడ్డ గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ చొరవతో ఆయన బావ విజయవాడ రీచ్ అండ్ నేషన్స్ చర్చ్ సంస్థ నిర్వాహకులు అద్దంకి కరుణకుమార్ సత్య వేదం శాస్త్రి బందం వారి ఆర్థిక సహాయంతో రూ లక్ష విలువచేసే నిత్యవసర సరుకులు నియోజకవర్గం యువ నాయకులు మండ లి వెంకట్ రామ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో మండలి వెంకట్రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని దాతలు అందజేసిన సహాయాన్ని బాధితులకు పంపిణీ చేశారు గ్రామ ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచేశ్వరరావు, మండలి దినేష్, గ్రామ పెద్దలు మండల శేషు, మండలి రామ్మోహన్రావు పాల్గొన్నారు.

కోట రాఘవయ్య విద్యాసంస్థల సహాయం : అవనిగడ్డ మండలంలోని వరద బాధితులకు కోడూరు కు చెందిన కోటరాగవయ్య విద్యాసంస్థలు సాయం



గుడివాడలో బాధితులకు సరుకులు అందజేస్తున్న దృశ్యం

అందజేశాయి. సోమవారం దక్షిణ చిరువోలు లంక గ్రామానికి చెందిన 300 మంది బాధితులకు కోటరాగవయ్య జూనియర్ డిగ్రీ కళాశాల రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కోట వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో రూ.1,60,000తో నిత్యవసర సరుకులు తమ వంతు సహాయంగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ నియోజకవర్గ యువ నాయకులు మండ లి వెంకట్ రామ్ చేతుల మీదుగా అందజేశారు. టిడిపి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, రామ్ పార్టీ అధ్యక్షులు బచ్చు రాఘవయ్య, ఎస్సీ సెల్ నాయకులు గోసాల బాలకోటేశ్వరరావు, పీత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడ ధనియాలపేటలోని ఇండియన్ బాప్టిస్ట్ బైబిల్ మిషన్ న్యూ లైఫ్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం రెవరెండ్ జాన్ మాథ్యూ ఆదేశాల మేరకు పాస్టర్ కె.ఆనంద్‌పాల్ ఆధ్వర్యంలో విజయవాడలోని బుడమేరు ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు అందించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు దేవరపల్లి కోటి, కొడాలి శ్రీకాంత్, చర్చి సంఘస్తులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** ఇటీవల కృష్ణ నది వరద ముంపుకు గురైన స్థానిక మండల పరిధిలోని ఆముదారలంకలో వరదల కారణంగా నష్టపోయిన వంద కుటుంబాలకి ఎస్టియు రాష్ట్ర నాయకులు కొమ్ము ప్రసాద్ మిత్ర బందం, కష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ ల సంయుక్త ఆధ్వర్యంలో లక్ష రూపాయల వ్యయంతో నిత్యావసర సరుకులు, దుప్పట్లు, టవల్స్ సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యు.టైటస్ పాల్, పచ్చిగళ్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, కష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లూరి బసవ, కొక్కిలిగడ్డ నవీన్,పసుమర్తి దినేష్,కొల్లూరి దినేష్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అలాగే వెలివోలులో బాపట్ల జిల్లాకు చెందిన కిష్కిందపాలెం, రావి లంక పోతారు లంక, చల్లపల్లి మండలానికి చెందిన నాదెళ్ల వారి పాలెం, వెలివోలు గ్రామాలకు చెందిన వరద బాధితులకు ఐఇసి చర్చ్ అందించిన ఐదు కిలోల బియ్యం, అర కిలో చింతపండు, అరకిలో కందిపప్పు, కేజీ ఉల్లిపాయలు, బత్తాయిలను అవనిగడ్డ శాసనసభ్యులు మండల బుద్ధ ప్రసాద్ అందజేశారు.



పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2000-2003 విద్యా సంవత్సరంలో బీకాం విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఇటీవల వచ్చిన వరదలకు నష్టపోయిన కుటుంబాలకు సహాయం అందజేశారు. విద్యార్థులు తమ బంధుమిత్రుల సహకారంతో మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక గ్రామస్తులకు 15 రకాల నిత్యవసర వస్తువులతో కూడిన 2000 రూపాయల ఖరీదు చేసే ప్యాకెట్లను 125 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ దాతత్వాన్ని చాటుకుంటున్నారని, ఆ సంఘం ప్రారంభం నుండి కళాశాల అభివద్ధిలో భాగస్వాములు సమాజానికి తమ వంతు సేవ చేయడం లో ఈ బ్యాచ్ ఎప్పుడు ముందుంటున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు బి సునీత, కే శ్రీకాంత్, పి జయరాజు, ఏ బాలాజీ, జి లోకనాథ్ పాల్గొనగా వీరిని ప్రిన్సిపాల్ తో పాటు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కమిటీ కన్వీనర్ డాక్టర్ కళాశాల అధ్యాపక సిబ్బంది ప్రశంసించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ముస్లింలు ఎంతో పవిత్రంగా నిర్వహించుకునే మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అవనిగడ్డ ఏడవ వార్డులోని మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ముస్లిం సోదరులకు జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషు బాబు కూడా మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలిపారు. **ప్రజాశక్తి - గుడివాడ :** అల్లా దయ కరుణ, కపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో బంటుమిల్లి రోడ్డులోని షాహీ మసీదులో జరుగుతున్న మిలాద్ ఉన్ నబీ ప్రార్థనల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారుఈ వేడుకల్లో మత గురువులు మెహబూబ్ బేగ్, మసీదు కమిటీ సభ్యులు గాంధీ, రషీద్‌బేగ్, ఖాజా, మొహిద్దీన్, షరీఫ్, సలీం, కరిముల్లా, మొబీన్, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరు ఘనంగా నిర్వహించారు. డోకిపర్రు తురాయిపాలెం మసీదు వద్ద మసీదు పెద్దల ఆధ్వర్యంలో విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కౌతరం, కట్టవాని చెరువు, అంగలూరు, వులవలపూడి, శేరి దగ్గు మిల్లి, వేమవరం, సుబ్బి చెరువు గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేడు విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మంగళవారం ఉదయం 10 గంటల 30 గంటలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి కార్యాలయం మచిలీపట్నంలో "శ్రీ విశ్వకర్మ జయంతి" నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాదికారులు, వసతి గహ సంక్షేమాదికారులు, కార్యాలయ సిబ్బంది హాజరకానున్నారని, కావున విశ్వకర్మకు సంబందించిన నాయకులు, సంఘ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.



వరద బాధితులకు వంట పాత్రలు పంపిణీ

ప్రజాశక్తి, భవానీపురం : వరద బాధితులకు తమ చేతనైనంత సాయం చేయాలనే లక్ష్యంతో అభ్యుదయ మహిళా మండలి ఆధ్వర్యంలో అభయ ప్రాజెక్టులో భాగంగా సోమవారం భవానీపురం పరిధిలోని ఊర్మిళానగర్, జోజినగర్ ప్రాంతాలలో వరద బాధితులకు వంట పాత్రలు, నిత్యావసర సరుకులు, భోజనాలు అంద చేశారు. సింగ్‌నగర్ కండ్రికలో 100 కుటుంబాల వారికి వంటపాత్రలు, భోజనపంపిణీ నిర్వహించారు. ఇప్పటికీ రెండుసార్లు భోజనం సుమారు 500 మందికి పంచారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ కృష్ణానది మధ్య ఉన్న చినలంకలో ఇళ్లు, ఇంటి సామాగ్రి, గేదెలు, మేకలు, కోళ్ళని, పంటపొలాలను కోల్పోయి జూపూడి ట్రక్ టెర్మినల్‌లో పునరావాస కేంద్రంలో ఉన్న నిరాశ్రయులైన సుమారు 350 మందికి దుప్పట్లు, టవల్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, శానిటరీ నాప్కిన్స్, టూత్ పేస్టులు, టూత్ బ్రష్‌లు, బిస్కెట్లు, భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలన్నీ సంస్థ ప్రెసిడెంట్ సుశీల వగ్రే ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు అన్నా మేరీ, శ్రీ అభిజ్ఞ, తేజస్విని, స్వచ్ఛంద కార్యకర్తలు క్రాంతి, సుప్రియ, కనకదుర్గ తమ సేవలు అందించారు. ఈ సేవా కార్యక్రమాల్ల దాతలు డాక్టర్ పద్మ బబ్బురి (యూకే), కన్నా లక్ష్మీ లావణ్య (యుఎస్‌ఏ) స్వరణ్యం క్లాతింగ్ అధినేత జపమాల, మేరీ రాణి రెడ్డి వెన్నం, సుధ మహర్షి (బీటెక్ స్టూడెంట్) ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రజాశక్తి - కంచికచర్ల : పరిటాల సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచికచర్ల గ్రామానికి చెందిన ఉప్పు తల్ల తిరుపతి రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. కంచికచర్ల గ్రామం నుండి ఇబ్రహీంపట్నం వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, పరిటాల సమీపంలో వెనక నుండి గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతి రాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారాన్ని అందుకున్న కంచికచర్ల ఎస్ఐ బి.రాజు, స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం విజయవాడ ట్రస్ట్ హాస్పటల్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భవానీపురం : 46వ డివిజన్ పరిధిలో అనారోగ్యంతో మరణించిన గన్నవరపు చిన్నమ్మడు కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఎంఎల్ఎ కార్యాలయ సిబ్బంది ఎన్‌డిఎ కూటమి నాయకులతో కలిసి వారి కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. మాజీ కార్పొరేటర్ గుర్రం కొండ ఎంఎల్ఎ సుజనా దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఎంఎల్ఎ సూచన మేరకు ఆయన కార్యాలయ సిబ్బంది, డివిజన్ టిడిపి అధ్యక్షులు దిటి ప్రభుదాస్‌తో కలిసి బాధిత కుటుంబాన్నిపరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.



ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - తిరువూరు : ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం పోరాడే సంఘం ఏపీ ఎస్ ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ సిహెచ్. శ్రీనివాస్ అన్నారు. సోమవారం తిరువూరు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ 46వ ఆవిర్భావ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ ఉపాధ్యక్షుడు బి.వి.రావు యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలపై, హక్కుల సాధనకోసం ఎస్‌డబ్ల్యూఎఫ్ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ తిరు వూరు డిపో కమిటీ కార్యదర్శి కె.వి.రావు, ఉపాధ్యక్షులు పర్వతం శంకరరావు, నాయకులు సంజీవరావు, ప్రజాసంఘాల నాయకులు మేకల నాగేంద్ర ప్రసాద్, రవి, వెంకటరత్నం, మోహన్ కృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్, సిఐటియు నాయకులు

బుల్లబ్బాయికి గోలి వీరచంద్రరావు స్మారక అవార్డు



ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సేవా తత్పరుడు అవ్వారు శ్రీనివాసరావు (బుల్లబ్బాయి)కి గోలి వీర చందర్రావు స్మారక అవార్డును ప్రదానం చేయనున్నారు. శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి మహోత్సవం సందర్భంగా విజయవాడలో ఈ నెల 17న నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఈ అవార్డును అందించనున్నారు. బుల్లబ్బాయి 20 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర కోశాధికారిగా అన్నదాన సత్రం కోసం కృషి చేశారు. కాయిన్ కలెక్షన్‌పై ఆసక్తితో లక్షలాది రూపాయలు వెచ్చించి కరెన్సీని సేకరించారు. శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం కమిటీ సహాయ కోశాధికారి, శ్రీ గణేష్ ఉత్సవ సమితి కోశాధికారిగా, పద్మశాలి సేవా సంఘం యువజన సేవా సంఘం అధ్యక్షులుగా, తిరుపతి పద్మశాలి అన్నదాన సత్రం కమిటీ సభ్యులుగా, కాశీలోని వారణాసి పద్మశాలి అన్నదాన సత్రం ధర్మకర్తగా, అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు.

నాగార్జున కళాశాల విద్యార్థులకు మెడికల్ సీట్లు

ప్రజాశక్తి - తిరువూరు : తమ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన ఇద్దరు విద్యార్థులు ఎంబిబిఎస్ సాధించినట్లు తిరువూరు నాగా ర్జున కళాశాల ప్రిన్సిపల్ కె.శేషగిరిరావు తెలిపారు. సరికొండి రాజేంద్ర ఠాగూర్ మంగళగిరి ఎన్ఆర్ ఐ మెడికల్ కళాశాలలో, రెడ్డి సుష్మిత రాజమండ్రి జిఎస్ ఎల్ మెడికల్ కళాశాలలో సీట్లు లభించినట్లు తెలిపా రు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం ఇరువురు విద్యార్థులను శేషగిరిరావుతోపాటు కరస్పాండెంట్ వేమూరు వాగేశ్వరరావు, ఛైర్మన్ దిరిశాల హనుమంత రావు, డైరెక్టర్స్ తూముల సూరిబాబు, కాటంనేని నర సింహారావు ఘనంగా సన్మానిచారు. తమ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం నుండే ఎంసెట్, నీట్ లో ప్రత్యేక శిక్షణ ఇవ్వటం ద్వారా విద్యార్థులు ఈ సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.



సిపిఎం గ్రామ కార్యదర్శిగా కిషోర్



ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామ కార్యదర్శిగా ఆడిమెల్లి కిషోర్‌ని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. సిపిఎం గ్రామ శాఖ మహాసభ సోమవరాం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ గ్రామ సమస్యలు ప్రభుత్వాలు పరిష్కరించాలని ప్రధానంగా డ్రెయినేజీ వ్యవస్థ, వీధిలైట్లు రోడ్లు వీధి కుక్కలు, శ్మశాన వాటికలు అభివృద్ధి చేయాలని ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ధనమ్మ వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి జ్యోతి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ 16వ వార్డు పాత బైపాస్ గ్యాస్ కంపెనీ రోడ్డులో సోమ వారం నందిగామ మాజీ సైని కులు ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం 60 మందికి నిత్యావసర సరుకులు, దుస్తులు పిల్లలకు పౌష్టికాహార బిస్కెట్లను సోమవారం శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి బాధితులకు సరుకులు దుస్తులు పౌష్టికాహారం బిస్కెట్లను పంపిణీ చేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని పాతబస్తీ పంజా సెంటర్‌లో మిలాదున్ బి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త సోలాహుల్ అలిహ్వాసల్లం జన్మదినం సందర్భంగా పంజా సెంటర్‌లో షాహీ మాస్క్‌లో కేశం చూపించారు. ఇందులో మాస్క్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్, ముసల్లెలు, సిఐటియు సెక్రటరీ బాబు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : నందిగామలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. భారీ ప్రదర్శనలు నిర్వహించారు. నందిగామ చందమామ పేట సెంటర్ వద్ద సోమవారం మీలాదున్నాబి పండగ వేడుకలు నిర్వహించారు. గవర్నమెంట్ హాస్పటల్ డౌన్ రోడ్ లో గల గౌస్ – ఏ – పాక్ జండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలలో శాసనసభ్యులు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. మక్కా మసీదులో మాజీ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : కొండపల్లిలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ పండగ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెయిన్ సెంటర్ లోని జామియా మసీద్ ఎదురుగా ఉన్న షరాఖానా వద్ద మహమ్మద్ ప్రవక్త ను స్మరిస్తూ ఆయన గుర్తుగా జెండాను అల్తాఫ్ బాబా ఆవిష్కరించారు. మీలాదున్నబి సందర్భంగా కొండపల్లిలోని హజ్రత్ సయ్యద్ షాబుఖారి నిత్య అన్నదాన లంగర్ ద్వారా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కేతన కొండలోను మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు.



మరమ్మతుల అనంతరం రహదారి

సడక్ రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కష్ణమ్మ వరదల కారణంగా ఇబ్రహీంపట్నం నుంచి కొటికలపూడి వరకు వరకు గల సడక్ రహదారి పూర్తిగా దెబ్బతింది. కొన్నిచోట్ల భారీగా గండ్లు పడి రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని రైతులు స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆయన స్పందించి మూలపాడు చెందిన సీనియర్ టిడిపి నేతలు గరికిపాటి శ్రీనివాసరావు, గరికపాటి శివకు రహదారి మరమ్మత్తులు నిర్వహించే దిశగా ప్రయత్నించాలని సూచించారు. ఎంఎల్ఎ ఆదేశాలతో ఇద్దరు టిడిపి సీనియర్ నేతల ఆధ్వర్యంలో గండ్లు పూడ్చి మరమ్మత్తులు నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు రామినేని రాజశేఖర్, గరికపాటి శ్రీనివాసరావు, శాసనసభ్యుని కార్యాలయ ప్రతినిధి ధనేకుల శేషగిరిరావు రహదారిని పరిశీలించారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- నందిగామ : మీలాద్ ఉన్ నబి పురస్కరించుకొని నందిగామ లోని ప్రతిభా హైస్కూల్ నందు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నందిగామ ఏసిపి డాక్టర్ రవి కిరణ్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఏసిపి మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలు చేయటం అభినందనీయం అని అన్నారు, యువత ముందుకు వచ్చి ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అడ్వకేట్ ఆజాద్ రక్తాన్ని డొనేట్ చేశారు . ప్రతిభ హై స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎండి షేర్ అలీ , ప్రతిభ హై స్కూల్ డైరెక్టర్ ఎండి సిద్దిక్ హుస్సేన్ నందిగామ సీనియర్ ప్రముఖ న్యాయవాదులు షేక్ కరీముల్లా మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయవాదుల సాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : బెజవాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది అరుణాదేవి జేడీ లక్ష్మీనారాయణ పార్టీ నాయకులు అరుణా దేవి ఆధ్వర్యంలో వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో సుమారు 25 మంది బాధిత కుటుంబాలకు నాణ్యమైన దుప్పట్లను, పండ్లు ఫలహారాలు అందజేసి ప్రముఖ సీనియర్ న్యాయవాది అరుణాదేవి, ప్రముఖ సీనియర్ న్యాయవాది, టిడిపి కౌన్సిలర్ ధరణికోట విజయలక్ష్మి శ్రీనివాసుల ఆధ్వర్యంలో బాధితులకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు కౌన్సిలర్ ధరణికోట విజయలక్ష్మి శ్రీనివాసరావు, అరుణాదేవి న్యాయవాద బృందం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
5
జిల్లా వార్తలు
మంగళవారం 17 సెప్టెంబర్ 2024

అకాల వర్షాలతో తీవ్ర నష్టం

- సాయం కోసం రైతులు ఎదురుచూపు



నీట మునిగిన వరిపొలాలు



ప్రజాశక్తి-గన్నవరం : అకాల వర్షాలతో గన్నవరం మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ పంటలు సగం పైగా తుడిచి పెట్టుకుపోయాయి. భారీ వర్షాలు, వరదలతో వరి పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేలాది రూపాయలు ఖర్చుచేసి వరిసాగు చేసిన రైతులకు ఏడాది వరద రూపంలో వారిని నట్టేట ముంచింది. ఎప్పుడులేని విదంగా మూడు రోజుల్లో 25 సెంటీమీటర్లు వర్షపాతం నమోదవటడంతో పొలాల్లో మోకాల్లోతు నీటిలో వరిపైరు ముంపుకు గురైంది. వరి పైరు తీవ్రంగా దెబ్బతింది. బుడమేరు, చీమల వాగు, డ్రైన్లు, చెరువులకు పడిన గండ్లు ముంపుకు కారణమని రైతులు అన్నారు. దీని మూలంగా ముఖ్యంగా మండలంలోని కేసరపల్లి, అజ్జంపూడి, జక్కుల నెక్కలం, సావర గూడెం, ముస్తాబాద తదితర గ్రామాలలో 90 శాతం నుండి 100శాతం పైరు దెబ్బతింది. అయితే పైరు నష్టం రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతినివ్వడంతో ఎన్యూ మరేషన్ సిబ్బంది పలు ప్రాంతాలలో క్షేత్రస్థాయికి వెళ్లి ఎన్యూమరేషన్. చేయలేదని విమర్శలు వినబడుస్తున్నాయి. నూరు శాతం దెబ్బతిన్న పైరు స్థానంలో ప్రత్యామ్నాయ పంట వేసుకోవడానికి ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉండవని రైతులు పేర్కొంటున్నారు. మూడు రోజుల్లో దరిదాపు 25 సెంటీమీటర్లు వర్షపాతం నమోదవటంతో పొలాల్లో మోకాల్లోతు నీటిలో వరిపైరుముంపు గురైంది. వర్షాలు వెనకబడి ఇంచుమించు రెండు వారాలు దాటుతున్న కొన్ని చోట్ల నీరు పోక నేటికీ ముంపులో ఉంది. సావరగూడెంలో 600 ఎకరాలకుపైగా వరిపైరు నూరు శాతం డ్యామేజ్ అవ్వగా అధికారులు తక్కువ నమోదు చేశారని రైతులు అంటున్నారు. బుడమేరు పరివాహక గ్రామాల్లో వందల ఎకరాలు లో వరి పైరు పూర్తిగా దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రభుత్వం నష్టపరిహార ప్రకటనలో స్పష్టత లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన పడుతున్నారు. పంట నష్టం నమోదు చేసిన వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సైతం నష్టపరిహారంపై నోరువిప్పి చెప్పలేకపోతున్నారు. ఇప్పటికైనా పంట నష్టాలను పూర్తిస్థాయిలో నమోదు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



విజయలక్ష్మి విగ్రహానికి పూలమాలలు వేసిన ఎంఎల్ఎ

ఆదర్శమూర్తి విజయలక్ష్మి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గన్నవరం : ఆదర్శ మూర్తి యలమంచిలి విజయలక్ష్మీ అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి పుణ్యచారిటీస్ ఛైర్ పర్సన్ యలమంచిలి విజయలక్ష్మి పంచమ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే దక్పధం కలగటం అభినందనీ యమన్నారు. వృద్ధులకు సామాజిక సహదయంతో ట్రస్ట్ ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, డాక్టర్ సిఎల్ రాయుడు, పుణ్యఛారిటీస్ కార్యదర్శి జాస్తి విజయ భూషణ్ కుమార్(బుజ్జి), ఆళ్ల గోపాలకష్ణ గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదుకోవాలని ఎంఎల్ఎకు రైతుల వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ సొసైటీ పరిధిలో 250 ఎకరాలలో ఇటీవల వచ్చిన వరదలకు వరి, కూరగాయల పంటలు నష్టపోయినందున తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్కు సొసైటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. సోమవారం బుద్ధ ప్రసాదును ఆయన స్వగహం వద్ద కలిసి పంటలు నష్టపోయిన తమకు నష్టపరిహారం వచ్చేలా కషి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఆర్డిఓ దష్టికి ఫోన్ ద్వారా ఈ సమస్యను తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో పులిగడ్డ గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు. సొసైటీ సభ్యులు పాల్గొన్నారు



ఎంఎల్ఎను కలిసిన రైతులు

బాధితులకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-పెదపారుపూడి : వర్షాలకు మండలంలోని ముంపుకు గురైన వరి పొలాలు, నీట మునిగిన గృహల బాధితులను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపోయిన బాధితులను ఆదుకుంటుందని అన్నారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు నాయకులు గుండపనేని శ్రీనివాసరావు స్వామి సజ్జ శివకుమార్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కుమార్‌రాజా

వరద బాధితులను ఆదుకుంటాం : మంత్రి



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : వర్షాలకు పంటలు, ఇళ్లు నష్టపోయిన ప్రతిఒక్కరికీ నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం పార్టీ నియోజక వర్గ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ లో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో ఇప్పటి వరకు 1338 అర్జీలు అందుకున్నామని, అందులో 1270 అర్జీలు వివిధ శాఖలకు చెందినవి కాగా.. వ్యక్తిగతమైన అర్జీలు 68 వరకు వచ్చాయన్నారు. ఆర్అండ్‌బీ శాఖకు చెందినవి అత్యధికంగా వచ్చాయన్నారు. అదే సమయంలో ఉద్యోగాల కోసం కూడా దాదాపు 198 అర్జీలు వచ్చాయన్నారు. దాదాపు 970కి పైగా అర్జీలను పరిష్కరించామన్నారు. పది రోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా ఉమ్మడి కష్ణా జిల్లా మొత్తం నీటమునిగిందని, ఎన్నడూ లేని విధంగా 11.48 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావడంతో జిల్లా మొత్తం ముంపునకు గురైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం కుడి కాలువ మట్టితో ఇతర కాలువల కట్టలు బలోపేతం చేసే అవకాశం ఉన్నా అలా చేయలేదని, పైగా మట్టిని అమ్ముకుని జేబులు నింపుకున్నారన్నారు. ఫలితంగా ఒక్క మచిలీపట్నం నియోజకవర్గంలోనే 42 వేల హెక్టార్లకు పైగా పంటలు నీట మునిగాయన్నారు. లంక గ్రామాల్లో వేలాది ఇళ్లు దెబ్బతిన్నాయని, వారందరికీ నిత్యావసర సరుకులిచ్చామన్నారు. అదే సమయంలో నష్టం అంచనాలను కూడా సిద్ధం చేశామని, అని త్వరలోనే పరిహారం అందజేతకు కూడా సన్నాహాలు చేస్తున్నామన్నారు. కేంద్ర బందం రెండు సార్లు వరద ప్రబావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఛార్జి రామకష్ణ, బీజేపీ ఇంఛార్జి సోడిశెట్టి బాలాజీ,పలువురు టిడిపి,కార్పొరేటర్లు,నాయకులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఓజోన్ పొర రక్షణపై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు : అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం ఏజీఅండ్ స్ జీఎస్ డిగ్రీకళాశాల విద్యార్థులు అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఓజోన్ ప్రాముఖ్యత తెలియజేస్తూ కళాశాలనుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఓజోన్ వల్ల ప్రయోజనం, నాశనం మవడంవల్ల జీవరాశికి కలిగే ప్రమాదం తెలియజేస్తూ విద్యార్థులు నత్య ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కళాశాలలో ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ మొక్కలు నాటారు. రసాయనశాస్త్ర విభాగ అధిపతి జి.గిరిప్రసాద్, కిషోర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విభాగం పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో : లయన్స్ క్లబ్ ఉయ్యూరు జోన్ ఆధ్వర్యంలో అంతర్జాయతీ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. జోన్ చైర్పర్సన్ ఎండి ఇస్మాయిల్ పర్యవేక్షణలో ఆకునూరులో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కాకాని వెంకటరత్న ప్రసాద్ ముఖ్య అతిథిగా పా ల్గొని ఓజోన్ రక్షణ అవగాహనపై రూపొందించిన పోస్టర్ను ఆవిష్కరించారు. సూర్యుడి నుంచి వచ్చే కిరణాలనుంచి ఓజోన్ పొర రక్షణగా ఉంటుందని, పర్యావరణ పరిరక్షణ ద్వారా దానిని కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, ట్రెజరర్ దినవహిప్రసాద్ పాల్గొని ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

డాక్టర్ సందీప్‌కు అభినందనలు



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వీడియో ప్రజెంటేషన్ అత్యుత్తమ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసి స్వర్ణ పతాకాన్ని అందుకున్న మచిలీపట్నంకు చెందిన డాక్టర్ సందీప్ వెముని రాష్ట్రంలోని ప్రముఖ ఈ ఎన్ టీ వైద్య నిపుణులు అభినం దించినట్లు సందీప్ కుటుంబ సభ్యులు తెలిపారు. సెప్టెంబర్ 13-15 మధ్య భీమవరంలో జరిగిన రాష్ట్ర ఈఎన్‌టీ సదస్సులో స్వర్ణ పతకాన్ని అందుకున్నారన్నారు. ముక్కు శస్త్రచికిత్సకు సంబంధించిన అరుదైన శస్త్రచికిత్సను ప్రజెంట్ చేశారు. ఇందులో ముక్కు వెనుక భాగం పూర్తిగా మూసుకుపోయిన పరిస్థితి, దీనిని Choanal atresia అని అంటారని, ఈ శస్త్రచికిత్సను 21 సంవత్స రాలుగా బాధపడుతున్న వ్యక్తిపై ఆయన విజయవంతంగా పూర్తి చేశారన్నారు. వైద్యులు సందీప్‌ని రాష్ట్రంలోని ఈ ఎన్‌టీ నిపుణులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వైద్యులు అభినందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చోరగుడి గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్



ప్రజాశక్తి-పమిడిముక్కల స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాముల అవ్వాలని గ్రామాల అభివద్ధికి పాటు పడాలని చోరగుడి గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణ కుమారి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ చోరగుడి సచివాలయం వద్ద ప్రారంభించే ఈ కార్యక్రమానికి కలెక్టర్ బాలాజీ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. అలాగే గ్రామంలో మొక్కల పెంపకం రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దష్టి పెట్టామని అన్నారు.

రూ.51 వేలు పలికిన లడ్డు



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : గణపతి నవరాత్రులను సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా గణేష్ నిమజ్జోత్సవ కార్యక్రమాలు జరిగాయి. రెడ్డి గూడెంలోని కాపులు బజార్ ఉన్న గణనాథుడు, లడ్డు ప్రసాదం రూ.51 వేలకు వేలం పాట ద్వారా గ్రామానికి చెందిన గనిపిశెట్టి పెద్ద నాగేశ్వరరావు సొంతం చేసుకున్నాడు. నాగేశ్వరరావును కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. రాజగోపాలస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డును రూ.22,500కు గ్రామానికి చెందిన తటవర్తి సత్యనారాయణ వేలంపాట ద్వారా సొంతం చేసుకున్నాడు. అనంతరం నిమజ్జనం చేశారు.



నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : ఇటీవల కురిసిన వర్షాల వల్ల వరదల ఉధృతికి సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన పలువురికి మైలవరంలోని తేజస్విని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సతీష్ బాబు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని నెలకు సరిపడా నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి ఏదైనా ఆపదలో ఉన్న వారికి తగిన సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ బ్యాడ్మింటన్ నిర్వాహకులు లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం కార్యదర్శి సిహెచ్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, నిర్వాహకులు

వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వినాయక నవరాత్రి ఉత్సవాలు కొండపల్లి యాదవుల బజారు బావి సెంటర్ గణేష్ మండపంలో ఘనంగా నిర్వహించారు. గణేష నవరాత్రుల ఉత్సవాలు గణేషుని నిమజ్జనంతో ముగిసినట్టు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయం నాట్య గురవులు సప్పా శివకుమార్ వారి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 2,000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

గండ్లు పూడ్చివేత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు శాంతినగర్ కవులూరు గ్రామాల మధ్య రహదారికి ఏర్పడిన భారీ గండ్లను అధికారులు పూడ్చించే పనిని సోమవారం ప్రారంభించారు. ఆదివారం గండ్లు పరిశీలించిన ఎంఎల్ఎ వసంత యుద్ధప్రాతిపదికన గండ్లకు మరమత్తులు చేయించాలని అధికారులను సూచించారు.

భారాలు మోపుతున్న ప్రభుత్వం : డి.వి.కృష్ణ

ప్రజాశక్తి - తిరువూరు : బిజెపితో స్నేహం చేసిన ప్రాంతీయ పార్టీలు ఏవి బతికి బట్టకట్టలేదని, ఇదే పరిస్థితి టిడిపి, జనసేన పార్టీలకు రాబోతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ పేర్కొన్నారు. సిపిఎం తిరువూరు పట్టణ కమిటీ పరిధిలోని సుందరయ్య కాలనీ, శాంతి నగర్, రాజీపేట, ఫ్యాక్టరీ సెంటర్ శాఖ మహాసభలు సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ సభ్యుల, సానుభూతి పరుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.వి.కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అను కూలంగా ఉంటూ ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి పాత్ర మరువలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సి.హెచ్.శ్రీనివాస్, మేకల నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతి నగర్ శాఖ కార్యదర్శిగా పంతంగి శ్రీనివాసరావు, సుందరయ్య కాలనీ శాఖ కార్యదర్శిగా మోటూరి చింతయ్య, ఫ్యాక్టరీ సెంటర్ కార్యదర్శిగా ఎస్.కె.నాగుల్ మీరా, రాజుపేట కార్యదర్శిగా బి.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న డి.వి.కృష్ణ

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరులపాడు : అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను, వ్యవసాయ కార్మికులను కౌలు రైతులను, ఆదుకోవాలని సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కోట కళ్యాణ్ డిమాండ్ చేశారు. జుజ్జూరు గ్రామ శాఖ సమావేశం లాల్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు మినుము, పెసర పంటలు, వరి, మొక్కజొన్న పూర్తిగా దెబ్బ తిన్నాయి. ప్రభుత్వ అధికారులు ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చేశామని చెబుతున్న ఏ పంటకు ఎంత నష్టపరిహారం ఇస్తారో తెలియని పరిస్థితి ఉందని ఆయన అన్నారు. వ్యవసాయ కార్మికులు 15 రోజులుగా పనులు లేక ఉన్నారని రోజుకు రూ.300లు కూలి వచ్చేదని ఒక్కొక్కరికి 4 వేల నుంచి 5 వేల ఆదాయం కోల్పోయారు. వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం రూ.పదివేలు ఉపాధి భృతి ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ వరదల వల్ల కట్టలేరు భారీగా పొంగి పొర్లటం వల్ల అటు వైరా ఏరు ఇటు కట్టలేరు కూడలి వద్ద ఉన్న లో బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి హై లెవెల్ బ్రిడ్జి ఉన్నా నిరుపయోగంగా ఉంది. దీనికి రోడ్డు సౌకర్యం కల్పించి రహదారిని పునరుద్ధరణ చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మంగలపూడి సుందరావు యాకోబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళ్యాణ్

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణం మధిర ఆర్చి రోడ్ తాళ్లూరి ఫిల్లింగ్ స్టేషన్‌లో తాళ్లూరి ట్రస్ట్ ఆద్వర్యంలో సోమవారం వరద బాధితుల సహాయార్థం 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ఎన్‌డిఎ కూటమి నేతలతో కలిసి వరద బాధితులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం ప్రతి ఒక్కరూ ముందుకు రావడం హర్షణీయమన్నారు.

తాళ్ళూరి ఫిల్లింగ్ స్టేషన్ లో లక్కీడ్రా విజేతలకు బహుమతులు

తాళ్ళూరి ఫిల్లింగ్ స్టేషన్‌లో ఇటీవల నిర్వహించిన లక్కీ డ్రా విజేతలకు నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య చేతులు మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగు, ఐదు, ఆరు, ఏడు తదితర బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ ఎస్.అధికారి రాజేశ్వరరావు, తాళ్ళూరి ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు రజనీకాంత్, ఫిల్లింగ్ స్టేషన్ మేనేజర్ వినయ్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్యను ఘనంగా సత్కరించారు.



పోలంపల్లి మున్నేరు డ్యామ్ నుండి సాగునీరు విడుదల

ప్రజాశక్తి - వత్సవాయి : రైతులు సాగునీటికి నూరుకి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అన్నారు. మండలంలోని పోలంపల్లి గ్రామంలో మున్నేరు చెక్ డాం వద్ద సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు కాలువలు రహదారులు పూర్తిగా దెబ్బతిని విపరీతంగా గండ్లు పడ్డ మునేరు కాల్వకు యుద్ధ ప్రాతిపదికన గుత్తేదారులను పిలిపించి పనులు అప్పగించినట్లు తెలిపారు. ఈ పనులను అనేకసార్లు చూసి పరిశీలించినట్లు తెలిపారు. పోలంపల్లి మునేరు డ్యాం నుండి వివిధ హోదాల్లో ఉన్న నాయకులు రైతులు కార్యకర్తలు అధికారులతో కలిసి సాగునీరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, రైతులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కిలారి సూర్యనారాయణ, ఆవుల రామారావు, సామినేని నాగేశ్వరావు, వంకాయలపాటి బ్రహ్మం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కోతకు గురైన రహదారికి

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని సింగవరం నుండి మక్కపేట వెళ్ళు రహదారిలో కిలోమీటర్ దూరంలో పైపులైన్ దగ్గర వరకు రోడ్డు కోతకు గురై గండి పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం నుండి రైతులు, అరకలు, మందు కట్టలు, ట్రాక్టర్లు వెళ్లాలంటే దారి లేకుండా పోయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా, రైతులు ఈ రహదారి గుండా మోటార్ సైకిల్ సహాయంతో వెళ్తున్నారు. అదుపు తప్పితే ప్రమాదమే అంటున్నారు. సింగవరం నుండి పెనుగంచిప్రోలు, మక్కపేట వెళ్లాలంటే ఈ రహదారి ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. మందు కట్ల కోసం, పెట్రోల్, డీజిల్ కోసం వెళ్తుంటారు. సింగవరం గ్రామ రైతులు సుమారు500 ఎకరాలు పైగా వ్యవసాయం సాగు చేస్తున్నారు. సాగులో పత్తి, మిర్చి, వరి, పంటలు వేస్తారు. ఈ రహదారి రైతులకు అనునిత్యం ప్రాణ గండంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారిని పరిశీలించి గండిని కూర్చి ఈ రహదారిని బాగు చేయాలని, తారు రోడ్డు వేయాలని కోరుతున్నారు.



బాధితులకు సాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల పరిధిలో కేతన కొండ గ్రామంలో మిలాద్ ఉన్ నబి పండగ రోజు వరద బాధితులకు ముస్లిం సోదరులు అండగా నిలిచారు. చిన్న చిన్న ఉద్యోగాలు, రోజువారి పనులు చేసుకునే యువకులు కలిసి కేతనకొండ, దాములూరు వరద ముంపునకు గురైన వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పఠాన్ కాజా, పటాన్ నాగుల్, అమీర్ భాష, హుజూర్, ఖాదర్ లు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో సాయం

ఇబ్రహీంపట్నం ప్రసాద్ నగర్‌లోని క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో ప్రార్థన మందిరంలో 300 మందికి దుప్పట్లు, రగ్గులు, టవల్స్, నగదు పంపిణీ చేశారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు వరద బాధితులను మానవతా దక్పథంతో ఆదుకోవాలని ఇబ్రహీంపట్నం ప్రసాద్ నగర్ క్రీస్తు సంఘం ఇవాంజెలిస్ట్ నల్లమోతు విజయ రావు (చంటి) అన్నారు. అంతకుముందు కొండపల్లి శాంతినగర్ జి కొండూరు మండలం కవులూరు గ్రామాల్లో 250 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ అకాల వర్షాలకు, బుడమేరు ప్రవాహానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నల్లమోతు సువర్ణ ప్రసాద్, నల్లమోతు ప్రసాదరావు పాల్గొన్నారు.

బాధితుడికి మెరుగైన వైద్యమందించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : పాము కాటుకు గురై విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చెదల శ్రీనును మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితుడిని పరామర్శించిన సిఐటియు మండల కార్యదర్శి మహేష్ మాట్లాడారు. బాధితునికి మ ఎరుగైన వైద్యం అందించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆర్థిక చేయూత అందించాలని కోరారు. ఈ నెల 11 న డ్యూటీ డ్రైవర్‌గా ఉన్న చెదల శ్రీను పాము కాటుకు గురైన విషయం తెలిసిందే.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం, చిట్టేల కట్టలేరు వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు అదుపులోకి తీసుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో అడ్డుకున్నట్లు సీనియర్ అసిస్టెంట్ గంధం పుల్లయ్య తెలిపారు. విజయ వాడ వరద ముంపు ప్రాంతాల్లో తహశీల్దార్ విధులు నిర్వహిస్తున్నారని, వచ్చిన తరువాత ఆ ట్రాక్టర్లపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - భవానీపురం : ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 17వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భవానీపురంలోని ఎన్‌డిఎ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు.

పలుచోట్ల అన్నదానం



గుడివాడలో...

ప్రజాశక్తి - కంచికచర్ల : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కంచికచర్ల గ్రామంలో పలు చోట్ల తొమ్మిదో రోజు సోమవారం అన్నదానం నిర్వహించారు. కంచికచర్ల బంక్ సెంటర్‌లో గల బాల వినాయక కమిటీ వారు ఏర్పాటు చేసిన గణనాథుని ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ముందుగా లడ్డు వేలం పాట నిర్వహించారు. విగ్రహం వద్ద ఉంచిన హుండీకి వేలం పాట నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర లారీ సర్వీస్ నిర్వాహకులు నంబూరు పెదబాబు రూ.11,999లకు హుండీని వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అనూమాల వాసు, ఆర్ఎస్‌పి ప్రసాద్, రాయల నలసింహారావు, వీరబాబు, కోటిబాబు, దేవిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో వర్తక, వ్యాపారులు ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద 2 వేల మందికి అన్నదానం నిర్వహించారు.

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లిలోని ఎస్.వి.టి.కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాలు సందర్భంగా వినాయకునికి 6 సంవత్సరాల నుంచి విగ్రహ కమిటీ వారు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 9 రోజులుగా స్వామివారికి విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ పంచాయతీ మెంబెర్ రాగాల రాము కుటుంబ సభ్యులకు లడ్డూ వేలంలో పాల్గొని వేలం పాట పాడి గెలిచిన అనంతరం లడ్డూ వేలం విజేతను వారిని ప్రకటించి కమిటీ సభ్యులు సన్మానించారు. కౌన్సిలర్‌లు చుట్టుకుదురు వాసు, అడపా వెంకయ్య నాయుడు, కాంద్రకొండ గురవయ్య స్థానిక పెద్దలు, అక్కల ప్రసాద్, చెరుకు ఆనందరావు, కట్టా శివకుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక మెయిన రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామి వారి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం స్వామి వారి ఉత్సవ లడ్డూలు వేలం 1లక్ష 17వేల రూపాయలనకు భక్తులు పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, దేవస్థాన ఈవో ప్రసాద్, దేవస్థాన ధర్మకర్తల ఉత్సవ కమిటి చైర్మన్ సాయిన రాజేష్, సభ్యులు శలంకాయల లీలాకుమార్, లోయ వాసు, వికృతి పోతురాజు, పంచుమర్తి శ్రీనివాసరావు, ఎరికిపాటి సుశీల, వీరమాచినేని శైలజ తదితరులు పాల్గొన్నారు.

యలవర్తి ఆధ్వర్యంలో...

స్థానిక కూరగాయల మార్కెట్‌లో యలవర్తి యూత్, యలవర్తి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుని విగ్రహానికి సోమవారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు ప్రారంభించారు.

రూరల్ మండలంలో బిళ్ళపాడులో....

బిళ్ళపాడు గ్రామంలోని యువత ఏర్పాటు చేసిన శ్రీ వినాయక చవితి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టిడిపి రూరల్ అధ్యక్షుడు వాసే మురళీ పాల్గొని స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి తదుపరి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రే వెంకటగిరి, మెండు జోజిబాబు, జివి నాంచారయ్య, యువత శంకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల నిర్వహిస్తున్న ఊరేగింపు కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ, మరియు గుడ్లవల్లేరు వీఆర్వో ప్రకాష్, ఏఎస్ఐ మెండు సాంబశివరావు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహిస్తున్నారు.

ఏచూరికి నివాళి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించారు. సిఐటియు మండల కార్యదర్శి యం మహేష్, కొండపల్లి ఐడిఎ ఆయిల్ సెక్టార్ కార్మికులు ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు యూనియన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎస్.సుందర్‌రావు, పి.రాజశేఖర్ బాబు, తదితర కార్మికులు పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం, కుందేరు గ్రామానికి చెందిన గద్దె మరియమ్మ (86) మతిస్థితితం లేక చెరువులు పడి మృతిచెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 15వ తేదీన రాత్రి సమయంలో మరియమ్మ బహిర్భూమికి చెరువుకు వెళ్లింది. ఎంతకీ రాకపోవడతో చుట్టుపక్కల వెతికినా కనపడలేదు. సోమవారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించింది. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



గందరగోళంగా సమావేశం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేతన కొండ శ్రీహరిపురం కాలనీ లే అవుట్ సభ్యుల సమావేశం గందరగోళ పరిస్థితుల్లో ప్రశ్నార్థకంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ సంఘంగా ఏర్పడి ఉద్యోగులు భూములు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన భూములను అభివృద్ధి చేయకుండా 655 కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా సొసైటీ పెద్దల వ్యవహార శైలి ఉందంటూ కొంతమంది సభ్యుల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గుంటుపల్లిలోని సిఎం కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి రాకుండా 29 మంది సభ్యత్వాలను రద్దు చేసినట్లు వారి సభ్యత్వం పునరుద్ధరించాలని సభ్యులు సమావేశంలో డిమాండ్ చేశారు. భూములను అభివృద్ధి చేయకుండా కాలయాపన చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు సుబ్బరాజు వ్యవహార శైలిపై తీవ్ర ఆరోపణలతో సంఘ సభ్యులు మండిపడ్డారు. సొసైటీ పాలకవర్గం నాన్చుడు వ్యవహార శైలితో ఫ్లాట్‌లు కొన్న ఉద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వసభ్య సమావేశానికి కొంత మంది సభ్యులను అనుమతించకపోవడంతో సమావేశం ఏర్పాటు చేసిన కన్వెన్షన్ హాల్ వద్ద నిరసనకు దిగారు. సర్వసభ్య సమావేశానికి బయటి నుండి ప్రైవేటు వ్యక్తులు వచ్చారని ఆరోపణలు చేశారు. ప్రశ్నించే వారిని సొసైటీ నుండి తొలగించి పాలకవర్గం అధ్యక్షుడు సుబ్బరాజు వేదింపులకు గురిచేస్తున్నారని సభ్యులు ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రిటైర్డ్, ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగులకు న్యాయం చేయలేని బోర్డు రద్దు చేసుకుందా మంటూ సమావేశంలో సభ్యుల నుండి ప్రతిఘటన ఎదురు కావడంతో సుబ్బారావు ఇతర డైరెక్టర్‌లు అర్ధంతరంగా సమావేశం నుండి వెళ్ళిపోయారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి నులకపేట సమీపంలోని ఎమ్మెల రామయ్య కాలనీ ఫారెస్టు ప్రాంతంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఎం ఎమ్మెల రామయ్య కాలనీ మూడో మహాసభ తీర్మానించింది. సోమవారం శాఖ మహాసభ వేముల రమణ అధ్యక్షతన జరిగింది. కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, మంత్రి లోకేష్ హామీ మేరకు ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని మరో తీర్మానం చేశారు. పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు వేముల దుర్గారావు రాజకీయ రిపోర్టు ఇచ్చారు. ఎమ్మెల రామయ్య కాలనీ కార్యదర్శిగా ఎం.నాగమల్లేశ్వరి, సహాయ కార్యదర్శిగా వేముల రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాజధాని అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి : రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. రాజధానిలో వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని, రాజధాని రైతులు, అసైన్డ్ రైతులకు పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలు వెంటనే చెల్లించాలని కోరారు. సోమవారం ఉండవల్లి ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన రాజధాని ప్రాంత ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సిహెచ్.సుందరరావు అధ్యక్షత వహించారు. ఇటీవల వర్షాలకు వచ్చిన వరదల వల్ల రాజధాని ప్రాంతంలో నష్టపోయిన వేలాది ఎకరాల రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బాధిత రైతులకు రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇటీవల మృతిచెందిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఏచూరి అభ్యుదయ, వామపక్ష శక్తులను, దళిత, గిరిజనులకు తీరని నష్టమని పేర్కొన్నారు. కమ్యూనిస్టు శ్రేణులు ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ గత ప్రభుత్వం తొలగించిన రాజధాని పేదలకు, అసంఘటిత కార్మికులకు సామాజిక పింఛను పునరుద్ధరించాలని కోరారు. రాజధానిలో నిర్మించిన టిడ్కో గృహాల బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు, ఈమని రామారావు, పీరూసాహెబ్, కె.వెంకటేశ్వర్లు, కృష్ణ, బాబూరావు, కె.ఆంజనేయులు, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి-తాడేపల్లి : మహ్మద్ ప్రవర్త బోధనలు అనుసరణీయమని తాడేపల్లి ఒకటో వార్డులోని జామియా మసీద్ పెద్దలు తెలిపారు. మిలాద్ ఉన్ నబి సందర్భంగా తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో స్థానిక యువకుతలో కల్చరల్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడుతూ ఇస్లాం అనేది శాంతికి చిహ్నమని చెప్పారు. మనుషులను ధర్మం వైపు నడిపించడానికి దోహదపడుతుందని చెప్పారు. ఆయన సూక్తులను మననం చేసుకోవాలన్నారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం



మాట్లాడుతున్న పాశం రామరావు

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి రూరల్ గ్రామాల్లో ఇటీవల వచ్చిన వరదల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమార్ చేశారు. సోమవారం తాడేపల్లి రూరల్ కమిటీ సమావేశం బొప్పన గోపాలరావు అధ్యక్షతన తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఎన్యుమరేషన్ వెంటనే పూర్తి చేసి నష్టపోయిన కంద, పసుపు, అరటి తదితర పంటలకు ఎకరానికి రూ.50 వేలు, వరికి రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. పశుసంపద అధికంగా ఉన్న చిర్రావూరు గ్రామంలో ఇటీవల వచ్చిన వరదల వల్ల కృష్ణానది లంకల్లోకి వెళ్లడానికి వీల్లేని పరిస్థితులు ఏర్పడటంతో మేత సమస్య పశువుల యజమానులకు ఇబ్బందికరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వేరే ప్రాంతంలో మేత కొనుగోలు చేసి రైతులకు అందించి అక్కడ పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. వరద వచ్చి వారం రోజులైనా నేటికీ లోతట్టు గ్రామాల్లో నీళ్ల నిలబడి ఉన్నాయని, దీని వల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిల్వ నీటిని బయటకు పంపించాలని, బ్లీచింగ్, పెనాయిల్ చెల్లించాలని కోరారు. క్లోరినేషన్ చేసిన మంచినీరు అన్ని గ్రామాలకు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, విజయరాజు, ఎన్.కిషోర్ పాల్గొన్నారు.

భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా బిసిల భూములు కబ్జా చేసిన వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ బిసి చైతన్య సమితి జాతీయ అధ్యక్షులు బిసి రమణ డిమాండ్ చేశారు. సోమవారం ఉండవల్లిలోని రాజగృహలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బిసిల భూములే అధికంగా కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. అవినీతి అధికారులు కబ్జాదారులకు సహకరించారని ధ్వజమెత్తారు. ఎటువంటి రక్షణ చట్టాలు లేనందు వల్ల బిసి భూములు అన్యాక్రాంతమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జాతీయ బిసి చైతన్య సమితి ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జె.బాబు, కె.ఏడుకొండలు, కె.వేణుగోపాల్, నాగరాజు, ఎం.రాము, కె.రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిసి చైతన్య సమితి నాయకులు

కండ్రికలో ఆహారం పంపిణీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : వరద బాధితులకు సిపిఎం ఒకవైపున భోజనం అందిస్తూ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాధితులకు అండగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు చిగురుపాటి బాబూరావు అన్నారు. విజయవాడ వరద ప్రాంతమైన నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్ (కండ్రిక కాలనీ)లో బాబురావు, సిపిఎం నేతలు పర్యటించిన అనంతరం కండ్రికలో భోజన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వరద బాధితులు వారి ఇబ్బందులు, కష్ట-నష్టాలను బాబూరావు దృష్టికి తీసుకెళ్లారు. వరదల్లో తమ ప్రాణాలే తప్ప ఇంకేమీ మిగల్లేదని తమ గోడు వెళ్ళబుచ్చారు. కుట్టు మిషన్లతో స్వయం ఉపాధి పొందుతున్న మహిళలను పరామర్శించారు, మిషన్లు దెబ్బతిని వేలాది రూపాయల నష్టపోయామని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు. ప్రభుత్వ సాయం అందడం లేదని, తాము ఓటు వేసి గెలిపించిన వారు తమను పట్టించుకోవడం లేదని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ 12 రోజులుగా సిపిఎం భోజనం కేంద్రాలు నడుపుతోందని అన్నారు. నేటితో 1,20,000 మందికి భోజనం అందించారన్నారు. సిపిఎం భోజనం కేంద్రాల వద్ద వందలాదిగా జనం బారులు తీరుతున్నారని, వంట చేసుకునే అవకాశం లేక జనం అల్లాడుతున్నారని అన్నారు. ఈ తరుణంలో సిపిఎం కేంద్రాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారని అన్నారు. నగరపాలక సంస్థలోని పాలకపక్షం, ప్రజా ప్రతినిధులు బాధితులను పూర్తిగా గాలికి వదిలేశారని అన్నారు. వరద ప్రాంతాల్లోని కూటమి శాసనసభ్యులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని పేర్కొన్నారు. నేటికి మునిగిన బాధితులను పరామర్శించే తీరిక లేకుండా ఉన్నారని అన్నారు.



భోజనం వడ్డిస్తున్న నాయకులు

కండ్రికలోని నగరపాలక సంస్థ పాఠశాలలు బురదతో నిండిపోయి ఉందని. మోటార్లు చెడిపోయాయని అన్నారు. పాఠశాల తరగతులు నిర్వహించటానికి కావలసిన వాతావరణాన్ని కల్పించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కె.దుర్గారావు, ఎ.వెంకటేశ్వరరావు, ఝాన్సీ, పీర్ సాహెబ్, వెంకటరెడ్డి, పిచ్చమ్మ, సావిత్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మైలవరం క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - మైలవరం : రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మైలవరం ఫిట్‌జోన్ జిమ్ క్రీడాకారులు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు మైలవరం ఫిట్ జోన్ జిమ్ కోచ్ వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 15 వరకు అమలాపురంలో ఎపిపవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో హిమ సంజన సబ్ జూనియర్ బ్రాంచ్, ఎం.శ్రీలక్ష్మి గోల్డ్ మెడల్, కె.వరలక్ష్మి గోల్డ్ మెడల్, డి.సీతయ్య సబ్ జూనియర్ బ్రోంజ్ మెడల్, ప్రదీప్ కుమార్ బ్రోంజ్ మెడల్, కేశ్వర రావు సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించిన వీరిని ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ సెక్రటరీ అధ్యక్షులు గంటా వెంకటేశ్వర్లు, మైలవరంలోని పలువురు అభినందించారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పోతిన వెంకటేశ్వరరావు తదితరులు

వరద బాధితులను స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలి

రిటైర్డ్ ఐపిఎస్ అధికారి రవీంద్రనాథ్ బాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వరదల వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ప్రభుత్వంతో పాటు తోటి సంఘీయులు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి ఆదుకోవలసిన అవసరం ఉందని సీనియర్ రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎం.రవీంద్రనాథ్ బాబు పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో సోమవారం ఎపిఎన్‌బి సంక్షేమ సంఘం, న్యాస్ సంస్థల ఆధ్వర్యంలో పేద మహిళలకు, వరద బాధితులకు తుమ్మిడి సంస్థ దాదాపు రూ.లక్ష విలువైన చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు వరదల్లో నష్టపోయిన నాయి బ్రాహ్మణ పేదలకు దాదాపు రూ.నాలుగు లక్షల నిత్యావసర వస్తువులు, వస్త్రాలు అందజేసినట్లు చెప్పారు. తుమ్మిడి సంస్థల యజమాని తుమ్మిడి శ్రీనివాస్, తెలుగు తోరణం పత్రిక సంపాదకులు అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడుతూ అవకాశం ఉన్న ప్రతివారు సహాయమందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌బి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్కాపురం కనకారావు, రాష్ట్ర సంక్షేమ సంఘం నాయకులు కొమ్మవరపు భాను ప్రసాద్, కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రామనాథం, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు డి.రాము, నవిరి మహేష్, రాయవరపు గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌విపిఇఐలో 50 వేలకు పైగా కార్నియా మార్పిడి

ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్ గర్గ్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఏ సంస్థా ఎన్నడూ సాధించని విధంగా అత్యధిక కార్నియా మార్పిళ్లు చేసిన విశిష్టతను ఎల్‌విపిఇఐలోని శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ సాధించింది. ఈ సందర్భంగా నగరంలోని కోడే వెంకట చౌదరి ప్రాంగణం దరి ఎల్వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో ఎల్‌విపిఇఐ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్ గర్గ్ మాట్లాడారు. 1987లో స్థాపించినప్పటి నుంచి ఎల్‌విపిఇఐ 50 వేలకు పైగా కార్నియా మార్పిడులు చేసిందని తెలిపారు. శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌ఎస్సిఐ) ఒక ప్రపంచ వనరుల కేంద్రంగా ఆశించబడిన ఈ కేంద్రం ప్రపంచంలోని కార్నియా వైకల్యం, అంధత్వ కారణాలు, రూపాలన్నిటినీ ప్రభావితం చెయ్యడానికి పనిచేస్తుందన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా కార్నియా సంరక్షణా సౌకర్యాల సామర్థ్య నిర్మాణం అభివృద్ధికి ఒక పెద్ద వనరు అన్నారు. భారతదేశంలో వ్యాపించిన, నాలుగు నేత్రనిధులు రామాయమ్మ అంతర్జాతీయ నేత్రనిధి, హైదరాబాద్ మొహ్సిన్ నేత్రనిధి, విశాఖపట్నం దష్టి దాన్ నేత్రనిధి, భుబనేశ్వర్ టికెఈబి విజయవాడ ప్రస్తుతం ప్రతి



సంవత్సరం 12,000కు పైగా నేత్రదానాలను అందుకుంటున్నాయన్నారు. వీటి సఫలతవలన, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ఒడిషా రాష్ట్రాలలో కార్నియా మార్పిడులకొరకు వెయిటింగ్ లిస్ట్ లేదని చెప్పారు. శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డా ప్రవీణ్ వడ్డవల్లి మాట్లాడుతూ కార్నియా వ్యాధుల ఫలితంగా వచ్చే కంటి సమస్యలకు సరైన చికిత్స అందుబాటును కొనసాగించడంపై శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ కేంద్రీకరిస్తుందన్నారు.

టాటా మోటార్స్ ఫెస్టివల్ ఆఫ్ కార్స్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ ఆటోమోటివ్ తయారీదారు టాటా మోటార్స్, ఈ పండుగ సీజన్ కోసం అద్భుతమైన ఆఫర్‌లతో 'ఫెస్టివల్ ఆఫ్ కార్స్'ను ప్రారంభించినట్లు సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవాత్సవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్‌లు గరిష్టంగా రూ.2.05 లక్షల వరకు ప్రయోజనాలను పొందవచ్చ, అని, దానితో పాటు అనేక ప్రసిద్ధ కార్లు, ఎస్యూవీల కోసం మునుపెన్నడూ చూడని ధరలను పొందవచ్చని తెలిపారు. అక్టోబర్ 31 వరకు పరిమిత కాలానికి ప్రత్యేకమైన, పండుగ ఆఫర్‌లు అందుబాటులో ఉంటాయని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవత్స తెలిపారు. వివరాలకు నగరంలోని టాటా మోటార్స్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

కంచికచర్లలో పడకేసిన పారిశుధ్యం

ఎక్కడి చెత్త అక్కడే - పందులు, దోమలు స్వైర విహారం

రోగాల బారిన ప్రజలు - పట్టించుకోని పాలక వర్గం అధికారులు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల గ్రామంలో పారిశుధ్యం లోపించింది. గ్రామంలో ఏ వీధిలో చూసినా ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు, కుప్పలుగా పేరుకుపోయింది. రోజురోజుకూ కంచికచర్ల మేజర్ పంచాయితీ పెరుగుతున్న జనాభాతో విస్తరిస్తున్నా, అందుకు సరిపడా పారిశుధ్య సిబ్బంది లేకపోవటంతో పారిశుధ్య పనులు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయితీ ఆదాయం ఏటా కోటి రూపాయలకు పైగానే ఉంది. అయినా ఎకాకడ చెత్త అక్కడే పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. కంచికచర్లలో ప్రధాన ప్రాంతాలైన మెయిన్ రోడ్డు, జుజ్జూరు రోడ్డు, గొట్టుముక్కల రోడు, వసంత కాలనీ, పెద్ద బజారు ఇలా ముఖ్యమైన ప్రదేశాల్లోనే చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందని, ఆ వాసనకు పందులు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ప్రయాణికులు, స్థానికులు అంటున్నారు. దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై నీరు ప్రవహించి వీధులలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కి తరలించి, వీధుల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గొట్టుముక్కల రోడ్డులో పేరుకుపోయిన చెత్త

రోజువారీ ఆహారంలో బాదం అవసరం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సరైన పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రముఖ పోషకాహార నిపుణులు పి.గురునాథ్ అన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లు అనే అంశంపై నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ నెలను జాతీయ పోషకాహార మాసాన్ని జరుపుకుంటున్నామన్నారు. బాదం పప్పులో విటమిన్ ఈ, మెగ్నీషియం, ప్రోటీన్, జింక్, పొటాషియం, డైటరీ ఫైబర్ వంటి 15 ముఖ్యమైన పోషకాలున్నాయని తెలిపారు. ఐసిఎంఆర్, ఎన్ఐఎన్ ఇటీవల విడుదల చేసిన ఆహార మార్గదర్శకాల ప్రకారం, మంచి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ తినడానికి బాదంను ఒక గింజగా గుర్తించింది అని తెలిపారు. బాదం పప్పును ప్రతిరోజూ తినడం వల్ల బరువును నిర్వహించడం, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం వంటి వివిధ ఆరోగ్య ప్రయోజనాల్లో సహాయపడుతుందని తెలిపారు.